సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 8 । మే । 2023



సేవలకు సలాం

నెల్లూరు రెడ్‌క్రాస్ సంస్థ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఎప్పటికప్పుడు కృషి చేస్తోంది. బ్లడ్ బ్యాంక్, క్యాన్సర్ ఆస్పత్రి ద్వారా అందిస్తున్న సేవలు ఎనలేనివి.

8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,810
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,641
3 శాతం జీఎస్టీతో	రూ.5,810
సవర (8 గ్రా)	రూ.46,480


గరిష్టం/కనిష్టం 37.0/28.0

వాతావరణం

ఆదివారం గాలిలో 61 శాతం తేమ ఉంది. సోమవారం జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

సోమశిలలో 49.181 టీఎంసీలు



చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 49.181 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 171 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 2,450 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 350, దక్షిణ కాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో నీటి మట్టం 96.164 మీటర్లుగా ఉంది.

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి



ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్‌లో రెండు యూనిట్ల నుంచి మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు ఇంజినీర్లు ఆదివారం తెలిపారు. ఒకటో యూనిట్లో 650 మెగావాట్లు, మూడో యూనిట్లో 750 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. సాంకేతిక కారణాలతో రెండో యూనిట్లో ఉత్పత్తి నిలిపేశారు.

20న జెడ్పీ సర్వసభ్య సమావేశం

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 20వ తేదీన ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన నెల్లూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సమావేశం జరుగుతుందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, పీఆర్, విద్యుత్, వైద్యారోగ్య శాఖ ఇతర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని తెలియజేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారన్నారు. జిల్లా పరిషత్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఉలవపాడు: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని కరేడు పంచాయతీ టెంకాయచెట్లపాళెంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. టెంకాయచెట్లపాళేనికి చెందిన కోటంగారి చినకోటయ్య (55) తన ఇంటి పక్కనే ఉన్న స్థలంలో కూరగాయలు సాగు చేస్తున్నాడు. పొలంలో నీళ్లు పట్టేందుకు విద్యుత్ సరఫరా కాకపోవడంతో వెళ్లి వైర్లు కదిలిస్తున్న సమయంలో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కావలిలో చోరీ

- 4 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదు అపహరణ

కావలిరూరల్: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని దుండగులు ప్రవేశించి 4 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదు చోరీ చేసిన ఘటన ఆదివారం కావలిలో చోటుచేసుకుంది. ఒకటో పట్టణ సీఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. కావలి పట్టణంలోని పాతవూరు ఈతమొక్కలవారివీధికి చెందిన వేముల నవీన్ ఏసీల దుకాణం నిర్వహిస్తున్నాడు. అతను తన భార్య మల్లిక, పిల్లలతో కలిసి ఈ నెల 5వ తేదీన ఇంటికి తాళం వేసి తిరుమలకు దైవదర్శనానికి వెళ్లాడు. ఆదివారం ఉదయం నవీన్ తండ్రి వేముల వెంకటేశ్వర్లు కొడుకు ఇంటి వద్దకు వెళ్లి చూడగా తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించాడు. నవీన్‌కు ఫోన్ ద్వారా సమాచారం తెలిపి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బీరువాలో ఉన్న 4 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదు దుండగులు అపహరించుకుపోయారని బాధితులు తెలిపారని పోలీసులు పేర్కొన్నారు. క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అదరగొట్టారు

పది ఫలితాల్లో ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల ప్రతిభ

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలంటే చిన్నచూపు ఉండేది. విద్యార్థులు చదువుకునేందుకు సౌకర్యాలు అంతంతమాత్రమే. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ పరిస్థితులను పూర్తిగా మార్చేసి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. బడుల రూపురేఖలు మారాయి. వసతులు మెరుగయ్యాయి. కొత్త బోధనా పద్ధతులు వచ్చాయి. దీంతో విద్యార్థులు బాగా చదివి అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

- 11 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత
- ఏపీ రెసిడెన్షియల్, బీసీ వెల్ఫేర్లో ఉత్తీర్ణత శాతం 90 పైనే..
- విద్యావ్యవస్థలో తెచ్చిన మార్పుల వల్లే ఈ ఫలితాలు

నెల్లూరు(టౌన్): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. ఉత్తీర్ణత శాతం 75.61గా నమోదు కాగా రాష్ట్ర స్థాయిలో జిల్లా తొమ్మిది స్థానంలో నిలిచింది. 11 బడులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. సర్కారు బడుల్లో అత్యుత్తమ ఫలితాల కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. మనబడి నాడు – నేడులో భాగంగా మొదటి, రెండో దశలో సుమారు 800కి పైగా పాఠశాలలను బాగు చేసి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించింది. పాఠ్యపుస్తకాలను సకాలంలో అందించింది. సబ్జెక్ట్ టీచర్ల కొరతను అధిగమించేందుకు విద్యాశాఖ అధికారులు జనవరి నెలలో సుమారు 600 మందిని సర్దుబాటు చేశారు. పది పరీక్షలకు పిల్లలను సమాయత్తం చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి చదివించారు. వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. మొత్తంగా ప్రభుత్వ బడుల్లో 16,000 మందికి పైగా పరీక్షలు రాశారు.

వీటిల్లో..

నెల్లూరు కేఎన్నార్ మున్సిపల్ స్కూల్ విద్యార్థి గోవుల గోకులకృష్ణారెడ్డి 593 మార్కులు సాధించాడు. అదే విధంగా పొదలకూరు బాలికల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి ఎ.వైష్ణవి 592 మార్కులు, వింజమూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి కె.తులసీ శ్రీరెడ్డి 588, కేఎన్నార్ స్కూల్ విద్యార్థి పి.మానస 587, కోవూరు బాలికల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఎస్.మొబీనా సుల్తానా 586, ఆత్మకూరు మండలం కరటంపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎం.స్నేహలత 586, నెల్లూరు పొదలకూరు రోడ్డులోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ విద్యార్థిని దేవర్షిని 583 మార్కులు సాధించారు.

- జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలకు సంబంధించి ఎయిడెడ్‌లో 8 మంది, ఏపీఎంఎస్‌లో 117, ఏపీ రెసిడెన్షియల్స్‌లో 79, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌లో 93, ఏపీటీడబ్ల్యూఆర్‌లో 9, బీసీ వెల్ఫేర్‌లో 28, ప్రభుత్వ పాఠశాలల్లో 73, కేజీబీవీల్లో 37, మున్సిపల్స్ స్కూల్స్‌లో 224, జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో 914 మంది 500 మార్కులకు పైగా సాధించారు.

ఐఐటీలో చదవడమే లక్ష్యం



శివగీతికకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మ్యాథ్స్ టీచర్‌గా బి.శివకోటయ్య పనిచేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ఎంతో నమ్మకంతో ఆయన తన కుమార్తె శివగీతికను అదే స్కూల్లో చదివించారు. బాలిక పది పరీక్షల్లో 582 మార్కులు సాధించింది. దీంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఐఐటీలో చదవడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా శివగీతిక తెలిపింది. ఆమె తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రభుత్వ బడులను కార్పొరేట్ పాఠశాలల కంటే మిన్నగా తయారు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మనబడి నాడు – నేడు పనులు చేపట్టడంతోపాటు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుండడంతో తమ కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చదివించామన్నారు.

లింగసముద్రం మండలంలోని పెదపవనిలో ఉన్న బాలయోగి గురుకుల బాలికల కళాశాలలో 80 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. 79 మంది ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యారు. ఎం.చక్రిత, పి.శ్రావణి అత్యధిక మార్కులు సాధించారు.



పెదపవనిలోని బాలికల గురుకుల కళాశాల



లింగసముద్రం: బాలయోగి గురుకులంలో చదివిన లింగసముద్రం మండలం ముత్యాలపాడుకు చెందిన ఎం.చక్రిత 574 మార్కులు సాధించింది. వీరిది వ్యవసాయ కుటుంబం. గుడ్లూరు మండలం వేలూరుపాడుకు చెందిన పి.శ్రావణి 573 మార్కులు సాధించింది. ఈ బాలిక తల్లిదండ్రులు దినసరి కూలీలు. ఐఐఐటీలో సీటు సాధించి ఉన్నత చదువులు చదవాలన్నది వీరిద్దరి లక్ష్యం.

మంచి ర్యాంక్ సాధిస్తా



మేం బీవీనగర్‌లో నివాసం ఉంటున్నాం. 7వ తరగతి నుంచి కేఎన్నార్ స్కూల్లో చదువుతున్నా. తండ్రి హరికృష్ణకి చిన్న పుస్తకాల దుకాణం ఉంది. ఇంటర్‌లో ఎంపీసీ చదివి, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించి ఐఐటీలో చేరడమే నా లక్ష్యం.

– గోకుల కృష్ణారెడ్డి, కేఎన్నార్ మున్సిపల్ స్కూల్

కరటంపాడు హైస్కూల్లో..

మర్రిపాడు (ఆత్మకూరురూరల్): మర్రిపాడు మండలంలోని డీసీపల్లికి చెందిన మునగచర్ల స్నేహలత కరటంపాడు జెడ్పీ హైస్కూల్లో చదువుతోంది. ఈ బాలిక పరీక్షల్లో 586 మార్కులు సాధించింది. స్నేహలత తండ్రి బాలాజీ, తల్లి కల్పన. కాగా బాలాజీ చిన్నపాటి హోటల్ నిర్వహిస్తున్నాడు. స్నేహలత అత్యధిక మార్కులు సాధించడంతో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు పెంచలరెడ్డి తదితరులు ఆమెను అభినందించారు.



స్నేహలతను అభినందిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు

మంచి ఫలితాలు వచ్చాయి



జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు వచ్చాయి. ఇందుకు ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు అభినందనలు. ఫెయిలైన వారికి సోమవారం నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నాం. తల్లిదండ్రులు కూడా సహకరించి పిల్లలను క్లాసులకు పంపించాలి.

– గంగాభవాని, డీఈఓ

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా



పొదలకూరు: తండ్రి తాపీ మేస్త్రీగా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతని కుమార్తె పది పరీక్షల్లో సత్తా చాటింది. పొదలకూరు పట్టణం తొగటివీధికి చెందిన అచ్చి వైష్ణవి స్థానిక డీఎన్ఆర్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతోంది. పది ఫలితాల్లో 592 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు శ్రీనివాసులు, చెంచులక్ష్మి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడమే తన లక్ష్యమని తెలిపింది.

కార్మికుడి కుమార్తెకు..



తల్లిదండ్రులతో తులసీశ్రీరెడ్డి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన కళ్లం తులసీ శ్రీరెడ్డికి 588 మార్కులు వచ్చాయి. ఆమె తండ్రి నాగసీతారామిరెడ్డి మండలంలోని చంద్రపడియలోని ఫార్మా ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వీరి స్వగ్రామం గుంటూరు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం కోసూరు మండలం అనంతవరం గ్రామం. ఉపాధి నిమిత్తం వింజమూరుకు వచ్చారు. ఈ సందర్భంగా తులసీశ్రీరెడ్డి మాట్లాడుతూ సివిల్స్ సాధనే తన లక్ష్యమని వెల్లడించింది.

ప్రభుత్వం ప్రోత్సహించింది



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని భగత్ సింగ్‌కాలనీకి చెందిన బిక్కం లక్ష్మీప్రసన్న వెంకటేశ్వరపురంలోని మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివింది. 561 మార్కులు సాధించింది. ఆమె తండ్రి పెంచలరెడ్డి బేల్దారి పనులు చేస్తుంటాడు. తల్లి సుభాషిణి పాలు విక్రయిస్తుంది. ప్రభుత్వ ప్రోత్సాహంతోనే తాను మంచి మార్కులు సాధించానని లక్ష్మీప్రసన్న తెలిపింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాకానుక అందించారని, అమ్మఒడి పథకం వచ్చినట్లు చెప్పింది. టీచర్లు ప్రత్యేక తరగతులు నిర్వహించారని వెల్లడించింది.

డాక్టర్‌ను చేస్తాం

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలోని ఖాజానగర్ వాసి అయిన షేక్ రిహానా స్థానికంగా బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి చదివింది. ఫలితాల్లో 583 మార్కులు సాధించింది. రిహానా తండ్రి తండ్రి షేక్ గౌసుల్ రెహ్మాన్ కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. మూడో కుమార్తె అయిన రిహానా పదిలో అత్యుత్తమ మార్కులు సాధించడంతో తండ్రి గౌసుల్, తల్లి జమీల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. తమ బిడ్డకు అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, విద్యాకానుక పథకాలు అందడంతో చదువుకు ఆర్థిక భారం భారం తగ్గిందని వారు తెలిపారు. టీచర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు వెల్లడించారు. రిహానాను డాక్టర్ చేసి పేదలకు సేవ చేసే విధంగా తీర్చిదిద్దుతాం.



తల్లిదండ్రులతో రిహానా

ఇంజినీరింగ్ చదువుతా



చేజర్ల: మండలంలోని నాగులవెలటూరుకు చెందిన ఐ.చలపతి, అన్నపూర్ణ దంపతుల కుమార్తె అయిన మహిమ చౌదరి స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో చదివి 584 మార్కులు సాధించింది. చలపతి వ్యవసాయం చేస్తుంటాడు. మహిమ చదువులో చురుగ్గా ఉండేది. నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ సాధించింది. ఐఐఐటీలో సీట్ సాధించి ఇంజినీరింగ్ చదువుతానని బాలిక తెలిపింది.

టీచర్ల ప్రత్యేక శ్రద్ధ



తోటపల్లిగూడూరు: మండలంలోని కొత్తపాళెం దళితకాలనీకి చెందిన ఈదూరు అనిల్, ముకుంద దంపతులు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారి కుమార్తె అయిన కీర్తన చెన్నపల్లిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి 567 మార్కులు సాధించింది. తల్లిదండ్రులు ప్రోత్సాహం, పాఠశాల టీచర్ల ప్రత్యేక శ్రద్ధతో మంచి మార్కులు తెచ్చుకుంది.

‘నీట్’కు 3,996 మంది హాజరు



నెల్లూరులో విద్యార్థుల వివరాలను పరిశీలిస్తున్న సిబ్బంది

నెల్లూరు(టౌన్): ఎంబీబీఎస్, డెంటల్ తదితర కోర్సుల్లో ప్రవేశం కోసం ఆదివారం నీట్ (నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని గోమతి సీబీఎస్ఈ, అక్షర విద్యాలయం, వీఆర్ఐపీఎస్, గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల, కావలిలోని ఆర్ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల, తడలోని పద్మావతి సీబీఎస్ఈ స్కూల్లో ఈ పరీక్ష జరిగింది. ఎన్‌టీఏ ఆధ్వర్యంలో దీనిని ఆఫ్‌లైన్‌లో నిర్వహించారు. ఎగ్జామ్‌కు 4,061 మంది దరఖాస్తు చేసుకోగా 3,996 మంది హాజరయ్యారు. 65 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 5.20 గంటల వరకు జరిగింది.

కేంద్రాల వద్దకు ముందుగానే..

పరీక్ష రాసేందుకు విద్యార్థులు ఉదయం 11 గంటలకే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే కేంద్రంలోకి అనుమతించారు. ఏ చిన్న ఆభరణం ఉన్నా తీసి వేయించారు. విద్యార్థులను కేంద్రాల ముఖద్వారం వద్ద మెటల్ డిటెక్టర్‌తో తనిఖీ చేశాక అనుమతించారు. మధ్యాహ్నం 1.30 గంటల అనంతరం అనుమతించలేదు.



పరీక్ష కేంద్రం బయట జనం

ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి

- నేటి నుంచి యాక్షన్ ప్లాన్ అమలు

నెల్లూరు(టౌన్): 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్‌పై యాక్షన్ ప్లాన్‌ను సోమవారం నుంచి అమలు చేస్తున్నట్లు డీఈఓ గంగాభవాని తెలిపారు. ఆదివారం ఆమె నెల్లూరులో వివరాలు వెల్లడించారు. ఈనెల 8 నుంచి 12వ తేదీ వరకు డిప్యూటీ డీఈఓలు, సెక్టోరియల్ అధికారులు, ఎంఈఓలతో డీఈఓ, ఏపీసీలు సమావేశం నిర్వహించాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలల హెడ్‌మాస్టర్లు, సీఆర్పీలతో సమావేశం నిర్వహించి స్కూల్ వయసు పిల్లలను గుర్తించాలని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ, వార్డు వలంటీర్లు, విద్య సంక్షేమ సహాయకులు, ఏఎన్ఎంల ద్వారా పాఠశాల వయసు పిల్లల గణన రిజిస్టర్‌ను అప్‌లోడ్ చేయాలన్నారు. వయసు, జెండర్, కేటగిరీల వారీగా పిల్లల జాబితాను తయారు చేయాలన్నారు. మండల స్థాయిలో ఎంఈఓలు తుదిజాబితాను డీఈఓకు అందజేయాలన్నారు. ఈనెల 15 నుంచి 19వ తేదీ ఆయా గ్రామ, మండలాల్లో ఎన్‌రోల్‌మెంట్ నిర్వహించాలన్నారు. ఈనెల 22 నుంచి 26వ తేదీ వరకు 5 నుంచి 6వ తరగతికి, 7 నుంచి 8వ తరగతికి వెళ్లే విద్యార్థుల డేటా సేకరించి వారు ఏ పాఠశాలలో చేరాలో సలహాలు ఇవ్వాలన్నారు. ఈనెల 29 నుంచి జూన్ 2వ తేదీ వరకు డ్రాపౌట్లను గుర్తించి వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమాన్ని చేయాలన్నారు. జూన్ 5 నుంచి 9వ తేదీ వరకు పాఠశాలల్లో సదుపాయాలు, పిల్లలకు వసతుల ఏర్పాటుపై సమావేశాలు నిర్వహించి అవసరమైన వాటిని స్కూల్ ప్రారంభానికల్లా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

కాకాణి రమణారెడ్డి మానవతామూర్తి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: ‘మా నాన్న కాకాణి రమణారెడ్డి గొప్ప మానవతామూర్తి. పేదవాడి పక్షాన న్యాయం ఉంటే అతడినే సమర్థించేవారు.’ అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సమితి మాజీ అధ్యక్షుడు దివంగత కాకాణి రమణారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా పొదలకూరు పట్టణం పాత ఎంపీడీఓ కార్యాలయం వెలుపల ఆదివారం రాత్రి ఆయన కాంస్య విగ్రహాన్ని మంత్రి కుటుంబసభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో మంత్రి మాట్లాడుతూ రమణారెడ్డి కడుపున పుట్టడం పూర్వజన్మ సుకృతమన్నారు. రాజకీయాల్లో ఏది చేయకూడదు, ఏది చేయాలనే విషయాలను ఆయన్నుంచే నేర్చుకున్నట్టు తెలిపారు. న్యాయం ఒక్కరి పక్షాన ఉన్నా పదిమందిని చెడ్డ చేసుకునైనా ఆ ఒక్కరిని ఆయన సమర్థించేవారన్నారు. ముందుగా తనను రాజకీయాల్లో ప్రోత్సహించలేదని వ్యాపారవేత్తగా బలపడిన తర్వాత రాజకీయాల్లోకి రావాలని తన తండ్రి ఆశించినట్లు తెలిపారు. నేటి రాజకీయాల్లో మనగలగాలంటే అవతలి వాడికి అంటిన బురదను మనం కూడా పూసుకోవాల్సి వస్తోందని ఎప్పుడు రమణారెడ్డి చెప్పేవారన్నారు. కుటుంబ విలువలు, విశ్వసనీయతను వివరిస్తూ తమను పెంచారని కాకాణి భావోద్వేగానికి గురయ్యారు. తొలుత గ్రామాల నుంచి హాజరైన కార్యకర్తలతో ర్యాలీగా వచ్చి రమణారెడ్డి విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. సభలో సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, నిరంజన్‌బాబు, దాసరి భాస్కర్‌గౌడ్, పెదమల్లు రమణారెడ్డి, కోనం చినబ్రహ్మయ్య, రావుల దశరథరామయ్యగౌడ్, ఎం.వెంకటశేషయ్య, వాకాటి శ్రీనివాసులురెడ్డి ప్రసంగించారు.



కాకాణి రమణారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో నాయకులు

ఘన నివాళి

కాకాణి రమణారెడ్డి ద్వితీయ వర్ధంతిని మంత్రి గోవర్ధన్‌రెడ్డి స్వగ్రామం తోడేరులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఘన నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ముందుగా మంత్రి కాకాణి కుటుంబ సభ్యులైన సతీమణి, కుమార్తెలు, అల్లుళ్లు, అక్కాచెల్లెళ్లు, బావలతో కలిసి రమణారెడ్డి ఘాట్ వద్దకు చేరుకుని నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి తండ్రిని తలుచుకుని భావోద్వేగానికి గురయ్యారు. నెల్లూరు, తిరుపతి ఎంపీలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎం.గురుమూర్తి, రాజ్యసభసభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరు, సూళ్లూరుపేట, గూడూరు ఎమ్మెల్యేలు మేకపాటి విక్రమ్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ్ చక్రవర్తి, మేరిగ మురళీధర్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ సుందరవల్లి, ఎన్‌డీసీసీబీ చైర్మన్ కె.సత్యనారాయణరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వెంకటగిరి ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు రమణారెడ్డి ఘాట్ వద్ద ఘనంగా నివాళులర్పించారు.

జాబ్‌మేళా రేపు

నెల్లూరు(మినీబైపాస్): నెల్లూరు ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో మంగళవారం జాబ్‌మేళా జరుగుతుందని జిల్లా ఉపాధి అధికారి ఎ.సురేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కైలాష్‌నాథ్ ఎంటర్‌ప్రైజెస్, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, భారత్ ఎఫ్‌హెచ్, రేస్ డైరెక్ట్ సర్వీసెస్ తదితర కంపెనీల వారు ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. పూర్తి వివరాలకు ఉపాధి కార్యాలయంలోని సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన స్థానిక నక్కలోళ్లసెంటర్ సమీపంలో నెల్లూరు వైపు వచ్చే రైలుపట్టాలపై శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. అతను సుమారు 35 నుంచి 40 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండి గ్రే కలర్, గ్రీన్ కలర్ అడ్డగీతలు గల హాఫ్ హ్యాండ్స్ టీషర్ట్, గ్రే కలర్ నైట్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సిఉంది. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆదివారం కోరారు.

సేవలకు సలాం

సేవకు ప్రతిరూపం రెడ్‌క్రాస్. ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన ఈ సంస్థ శాఖలు ప్రజలకు విశేష సేవలందిస్తున్నాయి. కాగా నెల్లూరు రెడ్‌క్రాస్ సంస్థ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఎప్పటికప్పుడు కృషి చేస్తోంది. బ్లడ్ బ్యాంక్, క్యాన్సర్ ఆస్పత్రి, సంజీవని జనరిక్ మందుల షాపు, ప్రకృతి వైపరీత్యాల సంస్థ తదితర శాఖల ద్వారా రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలు ఎనలేనివి. సోమవారం ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- జిల్లాలో విస్తృతంగా సేవలందిస్తున్న రెడ్‌క్రాస్
- దేశంలోనే నెల్లూరు రెడ్‌క్రాస్‌కు ప్రత్యేక గుర్తింపు
- గవర్నర్ చేతులమీదుగా అవార్డు అందుకోనున్న మాజీ చైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి
- నేడు ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం

నెల్లూరు(అర్బన్): మానవ జీవితం, ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ఏర్పడిన ఒక స్వచ్ఛంద మానవతా సంస్థ రెడ్‌క్రాస్. ఆ సంస్థ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి. యుద్ధాలు, వరదలు, ఉప్పెనలు, పెనుప్రమాదాలు, కరువు, కరోనా లాంటి విపత్కర పరిస్థితులు వచ్చినప్పుడు ప్రజలకు అండగా ఉంటూ ప్రజల ఆరోగ్యం, వారి సంరక్షణకు ప్రపంచవ్యాప్తంగా విశేష కృషి చేస్తున్న సంస్థ రెడ్‌క్రాస్. భారతదేశంలో 1920లో స్థాపించారు. 700 శాఖలకు పైగా విస్తరించిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నెల్లూరులో 2000 సంవత్సరంలో ఆధునిక భవనాన్ని ఏర్పాటు చేసుకుని సేవలందిస్తోంది. నెల్లూరు రెడ్‌క్రాస్ సంస్థ చేపట్టినన్ని సేవలు రాష్ట్రంలో ఎక్కడా లేవు. దేశంలోనే నెల్లూరు రెడ్‌క్రాస్ సంస్థ అందిస్తున్న సేవలకు ఎనలేని పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. ప్రపంచ రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడిగా నిలిచిన జీన్ హెన్రీ డ్యునాట్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం మే 8వ తేదీన ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని జరుపుతారు. అందులో భాగంగా నెల్లూరులో సోమవారం అనేక సేవా కార్యక్రమాలు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జరగనున్నాయి.

13 శాఖలతో సేవా కార్యక్రమాలు

నెల్లూరులో రెడ్‌క్రాస్ సొసైటీ 13 శాఖలతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. బ్లడ్ బ్యాంక్, క్యాన్సర్ ఆస్పత్రి, సంజీవని జనరిక్ మందులషాపు, పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమం, ప్రకృతి వైపరీత్యాల సంస్థ, స్పాస్టిక్



నెల్లూరులోని రెడ్‌క్రాస్ సంస్థ కార్యాలయం

సెంటర్, ర్యాబిస్ వ్యాక్సిన్ సెంటర్ లాంటి 13 శాఖల ద్వారా ప్రజలకు విస్తృతంగా సేవలందిస్తోంది. 7 వేల మంది జీవితకాల సభ్యులను కలిగి ఉంది. వందలాది మంది వలంటీర్లు స్వచ్ఛందంగా సేవలందిస్తున్నారు.

సేవా కార్యక్రమాల్లో కొన్ని..

జిల్లాలో రెడ్‌క్రాస్ ప్రారంభమైనప్పటి నుంచి విస్తృతంగా సేవలందిస్తోంది. ఇటీవల కాలంలో నిర్వహించిన కొన్ని సేవా కార్యక్రమాలను పరిశీలిస్తే..

- కరోనా విపత్కర పరిస్థితుల్లో రెడ్‌క్రాస్ సంస్థ రోగులకు అండగా నిలిచింది. పెద్దాస్పత్రిలో కరోనా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి రెడ్‌క్రాస్ సంస్థ తరఫున రోగులకు సలహాలు అందిస్తూ, పౌష్టికాహారం పంపిణీ చేస్తూ ధైర్యం చెప్పింది.
- ఆక్సిజన్ మొబైల్ బస్సులను ఏర్పాటు చేశారు. రోగులకు బెడ్ దొరికే వరకు బస్సులోనే ఆక్సిజన్ అందిస్తూ బెర్త్‌లను ఏర్పాటు చేశారు.
- కరోనాతో మరణించిన వారి మృతదేహాలకు రెడ్‌క్రాస్ సంస్థ అన్నీ తానై గౌరవప్రదంగా దహన సంస్కారాలు నిర్వహించింది. దేశంలోనే రెండో దహనశీలి మెషీన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇలా వందలాది మంది రోగుల మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించింది.
- కరోనా సమయంలో 80 వేల భోజనాలు నిర్వాసితులకు ఏర్పాటు చేసి అండగా నిలిచింది.
- ఇప్పటికీ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ ప్రతి సంవత్సరం 40 వేల మందికి పైగా రోగులకు రక్తాన్ని, కాంపోనెంట్‌లను అందిస్తూ ప్రజల



కృత్రిమ అవయవాలు అమర్చేందుకు కొలతలు తీసుకుంటున్న సిబ్బంది(ఫైల్)

ప్రాణాలు కాపాడేందుకు విశేష కృషి చేస్తోంది.

- నెల్లూరులో గతేడాది, అంతకుముందు పెన్నానదిలో వరదలు వచ్చినప్పుడు జయలలితనగర్, వెంకటేశ్వరపురం, సాలుచింతల ప్రాంతాల్లోని నిరాశ్రయులైన 700 మంది పేదలకు నిత్యావసర సరకులు, వంటసామగ్రి అందించింది.
- మానసిక దివ్యాంగుల కేంద్రాన్ని ఏర్పాటు చేసి దివ్యాంగులకు శిక్షణ ఇచ్చి వారు తమ పనులు తామే చేసుకునేలా తీర్చిదిద్దుతోంది. విద్యార్థులకు అవసరమైన రవాణా, భోజన వసతి రెడ్‌క్రాస్ స్పాస్టిక్ సెంటర్‌లో ఏర్పాటు చేశారు. ఇలా ప్రస్తుతం 100 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు.
- గాంధీజీ బోధనలు, ఆయన ప్రజల కోసం చేసిన పోరాటాలను వివరిస్తూ కార్యక్రమాలు చేపడుతోంది. రెండో సబర్మతి ఆశ్రమంగా పేరొందిన పల్లిపాడులోని పినాకినీ సత్యాగ్రహ కేంద్రాన్ని స్ఫూర్తిగా నిర్వహిస్తున్నారు.
- తలసేమియా రోగులకు ప్రతి రెండు, మూడు వారాలకు రక్తమార్పిడి జరగాలి. కొన్ని సందర్భాల్లో నాలుగైదు రోజులకే రక్తమార్పిడి జరగాలి. వీరికి రెడ్‌క్రాస్ ఉచితంగా రక్తం అందిస్తోంది. బ్లడ్‌బ్యాంక్ సేకరించిన రక్త యూనిట్లలో పెద్దాస్పత్రికి 30 శాతం ఉచితంగా ఇస్తోంది.
- పొదలకూరు రోడ్డులో ఏర్పాటు చేసిన క్యాన్సర్ ఆస్పత్రిలో కేవలం ఆరోగ్యశ్రీ ద్వారానే సేవలందిస్తూ ప్రజలకు ఎలాంటి ఖర్చు లేకుండా వైద్యం చేస్తున్నారు. సుమారు 8 వేల మంది వరకు ప్రతి సంవత్సరం ఇక్కడ కీమోథెరపీ, ఇతర క్యాన్సర్ సర్జరీలు, ఓపీ సేవలు పొందుతున్నారు.
- 6 నెలల క్రితం కాళ్లు, చేతులు లేని వారికి 400 మందికి కృత్రిమ కాళ్లు, చేతులు ఏర్పాటు చేసి రెడ్‌క్రాస్ అండగా నిలిచింది.

అవార్డుల పంట

నెల్లూరు రెడ్‌క్రాస్ సంస్థ తమ సేవలతో ఇప్పటికే అనేక అవార్డులను దక్కించుకుంది. ఈ సంస్థ నిర్వహిస్తున్న సేవలకు దేశంలోనే పేరు వచ్చింది. రాష్ట్ర గవర్నర్ రెండేళ్ల క్రితం ఇక్కడకు వచ్చి రెడ్‌క్రాస్ సేవలను ప్రశంసించారు. సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు.

మాజీ రెడ్‌క్రాస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డికి అవార్డు

జిల్లాలో ఇప్పటివరకు అందించిన సేవలకు గాను రెండో దఫా రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్‌గా పనిచేసిన ప్రస్తుత ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం విజయవాడలో గవర్నర్ చేతులమీదుగా అవార్డు అందుకోనున్నారు. జిల్లాలో సైతం రెడ్‌క్రాస్ అవగాహన ర్యాలీలు నిర్వహించనుంది.

విస్తృతంగా సేవలు



జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తృతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. రెడ్‌క్రాస్‌కు దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిది. నూతన కమిటీ ఏర్పాటుకు ఎన్నికలు జరిగాయి. త్వరలోనే ఫలితాలు రానున్నాయి. ప్రజలకు జవాబుదారీగా ఉంటూ సేవలందిస్తాం.

– పి.చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ మాజీ చైర్మన్, ఎమ్మెల్సీ

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- ఎమ్మెల్సీలు పి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి

ఆత్మకూరు: ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ నూతన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నూతన ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి తెలిపారు. ప్రైవేట్ విద్యాసంస్థల సమాఖ్య(అపస్మా) ఆధ్వర్యంలో నూతన ఎమ్మెల్సీలను ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో ఆదివారం ఘన సన్మానించారు. అపస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఈగా భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమను అత్యధిక మెజారిటీతో గెలిపించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వహణ కష్టనష్టాలను తనకు తెలుసునని, వారికి ప్రభుత్వపరంగా అండగా ఉంటామని ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల వరకే రాజకీయాలు అని, అనంతరం సేవా దృక్పథంతో పనిచేస్తానని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తెలిపారు. ప్రైవేట్ ఉపాధ్యాయులకు ప్రభుత్వపరంగా హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు ఇప్పించేలా కృషి చేస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న విషయాన్ని గుర్తెరిగి ప్రైవేట్ విద్యాసంస్థలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా కార్యవర్గ సభ్యులు పీవీ రమణారెడ్డి, ఎస్.రామ్మోహన్‌రెడ్డి, జి.ప్రభాకర్, తోట చిన్నవెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న అపస్మా కార్యవర్గ సభ్యులు

వాహనం ఢీకొని దుప్పి మృతి

ఓజిలి: జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో చుక్కల దుప్పి మృతిచెందిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. దాహార్తిని తీర్చుకునేందుకు అటవీప్రాంతం నుంచి ఓజిలి మండల రాజుపాళెం చెరువు వద్దకు దుప్పి వస్తుండగా, వాహనం ఢీకొని వెళ్లిపోయింది. అక్కడికక్కడే మృతిచెందిన దుప్పిని హైవే మొబైల్ పోలీసులు గుర్తించి అటవీ అధికారులకు తెలియజేశారు. దీంతో అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని దుప్పికి శవ పంచనామా చేసి పూడ్చి వేసినట్లు తెలిపారు.

ఆటో ఢీకొని వృద్ధురాలు..

ఉదయగిరి: దుత్తలూరు మండలం సోమలరేగడ గ్రామంలో ఆటో ఢీకొని జి.కొండమ్మ(70) మృతిచెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలో కోడిగుడ్లు దించేందుకు వచ్చిన ఆటో వెనక్కి వస్తూ ప్రమాదవశాత్తు కొండమ్మను ఢీకొంది. తీవ్రగాయాలు కావడంతో కుటుంబసభ్యులు ఆమెను చికిత్సనిమిత్తం ఉదయగిరిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాజిరెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం



చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలం ముత్తుకూరు గ్రామ పరిధిలోని ఉత్తర కాలువలో ఆదివారం గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యమైందని పోలీసులు తెలిపారు. సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన అతను నీలిరంగు చొక్కా, నలుపు ప్యాంట్ ధరించి ఉన్నాడు. కాలు జారి ఉత్తర కాలువలో పడి మృతిచెంది ఉండవచ్చని అనుమానిస్తున్నారు. వివరాలు తెలిసిన వారు 9440700011 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలని అనంతసాగరం ఎస్సై సంతోష్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

దివ్యాంగులకు ఫల సరుకుల పంపిణీ

గూడూరు: గూడూరు సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఆదివారం ఫల సరుకులు పంపిణీ చేశారు. స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలు ఆవరణలో సిద్దారెడ్డి జనార్దన్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి ఇంద్రసేనమ్మ దాతృత్వంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ డాక్టర్లు సుధీర్‌రెడ్డి, సాయి శరత్‌రెడ్డి, ప్రియాంకరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, పీవీ కృష్ణారెడ్డి, బండి ధనుంజయరెడ్డి, జైపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు..



రమణయ్య మృతదేహం

గూడూరురూరల్: మండలంలోని మేగనూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాటి చెట్టుపై నుంచి పడి మృతిచెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు గీత కార్మికుడు జడపల్లి రమణయ్య(49) సాయంత్రం తాటిచెట్టు ఎక్కుతుండగా కాలు జారి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 138
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 238
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 264
లేయర్ చికెన్	: 145



పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.72
సన్నవి	: రూ.45
పండ్లు	: రూ.25



బ్రేక్స్ ఇండియా పరిశ్రమలో కార్మికుడి మృతి



పరిశ్రమలో యంత్రాన్ని పరిశీలిస్తున్న సీఐ నరసింహారావు

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని మేనకూరు సెజ్‌లో ఉన్న టీవీఎస్ బ్రేక్స్ ఇండియా పరిశ్రమలో పనిచేస్తున్న జార్ఖండ్ ప్రాంతానికి చెందిన కార్మికుడు పవన్ బాద్వజ్(19) శనివారం అర్ధరాత్రి దుర్మరణం చెందాడు. పరిశ్రమలో ఇసుకను వేడి చేసే యంత్రాన్ని శుభ్రం చేస్తుండగా ఒక్కసారిగా సెన్సర్ బటన్ ఆన్ అయిపోవడంతో మెషీన్ స్టార్ట్ అయిపోయింది. పెద్ద ఫ్యాన్ వేగంగా తిరగడంతో అందులో ఉన్న కార్మికుడు పవన్ శరీరం ముక్కలై పోయి మృతిచెందాడు. ఈ సంఘటనపై పరిశ్రమ మేనేజర్ అరుణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై సీఐ నరసింహారావు కేసు నమోదు చేశారు. సీఐ ఆదివారం పరిశ్రమ వద్దకు వెళ్లి క్షుణంగా పరిశీలన చేశారు. పవన్ శరీర భాగాలను అతికించి ఆదివారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం చేసి, మృతదేహాన్ని ప్రత్యేక అంబులెన్స్‌లో జార్ఖండ్ ప్రాంతానికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో పది మందికి గాయాలు

- నెల్లూరులో ఘటన

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పదిమంది గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. ట్రాక్టర్ భగత్‌సింగ్ కాలనీ నుంచి హైవే దాటుతోంది. ఈక్రమంలో తిరుపతి వైపు నుంచి ఒడిశా వెళ్తున్న మినీ వ్యాన్ ట్రాక్టర్‌ను ఢీకొంది. దీంతో మినీ వ్యాన్ ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. అందులో ప్రయాణిస్తున్న 12 మందిలో పది మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌ల్లో నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. బాధితులంతా తిరుపతి సమీపంలో ఓ పరిశ్రమలో పనిచేస్తున్నారు. స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న నవాబుపేట, ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. కాగా ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



బాధితులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

భారీగా రేషన్ బియ్యం స్వాధీనం

కందుకూరు: పట్టణంలోని పామూరు రోడ్డులో ఉన్న ఓ రైస్‌మిల్‌పై ఆదివారం రాత్రి రెవెన్యూ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో రైస్ మిల్లులో పెద్ద ఎత్తున నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని అధికారులు గుర్తించారు. రైస్ మిల్లులో దాదాపు 720 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. కొందరు రేషన్ బియ్యం అక్రమ వ్యాపారులు ఈ మిల్లును లీజుకు తీసుకుని నిర్వహిస్తున్నారు. రేషన్ బియ్యాన్ని డీలర్ల వద్ద నుంచి కొనుగోలు చేసి మిల్లులో పాలీష్ పట్టి కల్తీ చేస్తున్నారు. బ్యాగులు మార్చి పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ దందాపై సబ్‌కలెక్టర్‌కు శోభికకు వచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ, పోలీస్ అధికారులు మిల్లుపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాడుల్లో బస్తాలు మార్పు చేసి నిల్వ ఉంచిన 720 బస్తాల రేషన్ బియ్యాన్ని అధికారులు గుర్తించారు. అయితే ఈ బియ్యం ఎక్కడి నుంచి వచ్చాయి, మిల్లును ఎవరు నిర్వహిస్తు న్నారు అనే విషయాలను గుర్తించాల్సి ఉంది. ఈ మేరకు తహసీల్దార్ సీతారామయ్య, పట్టణ ఎస్సై హనీఫ్‌లు ఆదివారం మిల్లులో తనిఖీ చేసి వివరాలు సేకరిస్తున్నారు.



మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

వైభవంగా చెన్నకేశవుని రథోత్సవం



గూడూరు: చెన్నకేశవస్వామి రథోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా సాగింది. స్థానిక కరణాలవీధిలోని చెన్నకేశవస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్ల రథోత్సవం జరిగింది. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, విశేషాలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామిని రథంలో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

- ఇద్దరికి గాయాలు

పెళ్లకూరు: నాయుడుపేట – పూతలపట్టు జాతీయ రహదారి మార్గంలో గుర్రప్పతోట గ్రామం వద్ద ఆదివారం రాత్రి ఎదురుగా వస్తున్న మోటార్‌బైక్‌ను లారీ ఢీకొంది. ఈ ఘటనలో ప్రభాస్ అనే యువకుడికి తీవ్రంగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నాయుడుపేట నుంచి ప్రభాస్ అనే వ్యక్తి తన స్నేహితుడితో కలిసి తిరుపతికి మోటార్‌బైక్‌పై వెళుతున్నాడు. ఈ క్రమంలో గుర్రప్పతోట గ్రామం వద్ద తిరుపతి నుంచి నెల్లూరుకు వెళుతున్న లారీ బైక్‌ను ఢీకొంది. ప్రభాస్‌ను స్థానికులు 108 అంబులెన్స్‌లో నాయుడుపేటకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

వెంకటగిరిరూరల్: పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై జిలాని కథనం మేరకు మండలంలోని చింతగుంట శివారుల్లో పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.11,020 నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆదివారం తెలిపారు.

కాలువలో పడి యువకుడి మృతి

బుచ్చిరెడ్డిపాళెం: ప్రమాదవశాత్తు కాలువలో పడి సునీల్‌కుమార్(24) అనే యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని కాగోళ్లపాడు సమీపంలోని కొత్తకాలువ వద్ద ఆదివారం వెలుగుచూసింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు మండలంలోని దామరమడుగు పంచాయతీ పరిధిలోని ఆర్‌ఆర్‌నగర్‌కు చెందిన సునీల్‌కుమార్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఒంటరిగా వెళ్లి కొత్తకాలువ వంతెనపై పూటుగా మద్యం తాగి ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయి ఉంటాడని భావిస్తున్నారు. ఆదివారం ఉదయం స్థానికులు కాలువలో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వీరప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



సునీల్‌కుమార్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై వీరప్రతాప్